క్లుప్తంగా

గాలి గోపురం నిర్మాణపు పనులు ప్రారంభం



గోపురం నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

కూడేరు: స్థానిక జోడు లింగాల సంగమేశ్వర స్వామి దక్షిణ వైపు గాలిగోపురాన్ని బళ్లారికి చెందిన బసవన్న గౌడ్ అనే భక్తుడు రూ.60 లక్షలతో నిర్మించేందుకు ముందుకొచ్చాడు. ఇప్పటికే బసన్నగౌడ్ ఉత్తరం వైపు కూడా గాలిగోపురాన్ని నిర్మిస్తున్నాడు. కొన్నేళ్లుగా శివపార్వతులను కొలుస్తున్నానని తన మొక్కుగా ఉత్తరం–దక్షిణం వైపు గాలి గోపురాలు నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు బసవన్న గౌడ్ తెలిపారు.

ఒత్తిడికి గురికాకూడదు



చిన్నంపల్లిలో పదో తరగతి విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీధర్

శెట్టూరు: విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని పదోతరగతి విద్యార్థులకు ఎంఈఓ శ్రీధర్ సూచించారు. ఆదివారం రాత్రి ఆయన మండలంలోని చిన్నంపల్లి, యాటకల్లు గ్రామాల్లో పదో తరగతి విద్యార్థుల పరీక్షల సన్నద్ధతను పరిశీలించారు. పది విద్యార్థుల వివరాలతో రెండు గ్రామాలకు వెళ్లిన ఎంఈఓ విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారనే అంశాన్ని విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఎంఈఓ ఓబులపతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

వక్కమొక్కలకు డిమాండ్

కుందుర్పి: మండల వ్యాప్తంగా బోరుబావుల కింద మిశ్రమ పంటగా వక్క, తమల పాకుల తోటలను సాగు చేస్తున్నారు. దీంతో వక్క మొక్కలకు డిమాండ్ పెరిగింది. ఒక్కో వక్క మొక్క రూ.35 నుంచి రూ.40 పలుకుతోంది. బహిరంగ మార్కెట్లలో క్వింటాల్ వక్క రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకు ధర పలుకుతుండడంతో రైతులు విస్తారంగా వక్కతోటలను సాగుచేస్తున్నారు. కెంచంపల్లి, కలిగొలిమి, వడ్డెపాళ్యం, నాగేపల్లి, వెంకంటపల్లి తదితర గ్రామాల్లో రైతులు నర్సరీలను ఏర్పాటు చేసి, వక్క మొక్కలను పెంచుతూ ఆదాయం గడిస్తున్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాణీఛత్రం పాతబస్టాండ్ ప్రవేశ ద్వారం వద్ద సూర్యా సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో సమితి సభ్యులు షబ్బీర్, మల్లికార్జున, తిప్పేస్వామి, నిసార్, అనిల్, సురేష్, శీన, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవతకు పూజలు



కొర్రకోడులో పెద్దమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన దృశ్యం

కూడేరు: మండలం కొర్రకోడులో పెద్దమ్మ ఆలయంలో ఆదివారం మండల పూజలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దమ్మ అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఐడీ నంబర్ కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోండి

వజ్రకరూరు: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం ప్రతి రైతూ కొత్త ఐడీ నంబర్ కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ మధుకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో పట్టాదారు పాసుపుస్తకం కలిగిన ప్రతి రైతూ కొత్త ఐడీ నంబర్ కలిగి ఉండాలన్నారు. ఇందుకోసం అన్ని రైతుసేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింకు అయిన ఫోన్ నంబర్ తీసుకెళ్లాలన్నారు.

రైతులు పేర్లు నమోదు చేసుకోండి

పప్పుశనగ కొనుగోలుకు అనుమతి ఇచ్చినట్లు ఏఓ మధుకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పప్పుశనగ పండించిన రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధర క్వింటా రూ.5,650తో కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు రైతుసేవా కేంద్రా ల్లో పేర్లను నమోదు చేసు కోవాలన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు


ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకలు సోమవారం లెక్కించనున్నట్లు మఠం సహాయ కమిషనర్ రాణి ఆది వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు గవిమఠం ఆవరణలో అధికారులు, సిబ్బంది, అర్చకుల సమక్షంలో హుండీ కానుకల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు.

అడ్డగోలుగా ఔషధాల విక్రయం

మందుల దుకాణం నిర్వహించాలంటే ఫార్మసిస్టు ఉండాలి.. మందు ఎలా వేసుకోవాలో రోగికి విడమరిచి చెప్పాలి.. వైద్యుడు రాసిచ్చిన చీటీ ఉంటేనే మందులు విక్రయించాలి.. రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టి అవసరమైన మందులు ఇవ్వాలి.. ఇలా మెడికల్ షాపుల నిర్వాహకులు కచ్చితమైన నిబంధనలు పాటించాలి. కానీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డాక్టర్ చీటీ లేకుండానే ఎవరు అడిగినా మందులు విక్రయిస్తున్నారు. యాంటీబయోటిక్ గుళికలు మోతాదుకు మించి అంటగడుతున్నారు. డిఫార్మసీ, ఎంఫార్మసీ సర్టిఫికెట్ ఉంటే చాలు..మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో దుకాణదారులు నిబంధనలు పాటించలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.



- నిబంధనలకు విరుద్ధంగా మందుల దుకాణాల నిర్వహణ
- ఎంబీబీఎస్ వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండానే విక్రయాలు
- కొన్నిచోట్ల కాలం చెల్లిన మందులు అంటగడుతున్న వైనం



కళ్యాణదుర్గంలో బయటపడిన కాలం చెల్లిన మందులు

రాయదుర్గం/కళ్యాణదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 162 మెడికల్ దుకాణాలు ఉన్నాయి. సగానికిపైగా నిబంధనలు పాటించలేదు. తలనొప్పి, జ్వరం, జలుబు, కడుపునొప్పి, ఒళ్లు నొప్పులు, కీళ్లనొప్పులు, గ్యాస్ట్రిక్ సమస్యలు ఇలా దేనికైనాసరే మెడికల్ దుకాణాల వద్దకు వెళ్తే చాలు.. మందు బిల్లలు ఇచ్చేస్తున్నారు. ఏ మందు వేసుకోవాలో? ఎన్ని సార్లు వాడాలో కూడా చెప్పి పంపుతున్నారు. కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ సమస్యలకు వ్యాధి తీవ్రత, రోగి వయసు, శరీరతత్వం తదితరాలను బట్టి డాక్టర్లు మందులు ఇవ్వాల్సి ఉంది. అయితే డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండానే హైడోస్, లోడోస్ అనే రకాలు కూడా ఇచ్చేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు కొందరు దగ్గుకు వాడే సిరప్‌లు తాగేస్తున్నారు. కోరెక్స్, పెన్సిడ్రిల్ వంటి ఔషధాలు కొంత మత్తును కలిగిస్తాయి. అల్కహాల్, ఇతర మత్తు పదార్థాలకు బానిసైన వారు అవి దొరకని సమయాల్లో మెడికల్ సిరప్‌లు వాడుతున్నారు.

లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని మెజార్టీ మందుల షాపులన్నీ బినామీ వ్యక్తుల పేరిట నిర్వహిస్తున్నారు. నైపుణ్యం ఉన్న ఫార్మసిస్టు ఆధ్వర్యంలో కోర్సు పూర్తి చేసి, అనుభవం కలిగిన సిబ్బందితోనే దుకాణాలు నిర్వహించాలి. చాలా మంది తక్కువ వేతనంతో యువకులను పనిలో పెట్టుకుంటున్నారు. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు మెడికల్ షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకొని నిబంధనలకు పాతరేస్తున్నారు.

చూసీచూడనట్టు వదిలేస్తున్న అధికారులు..

డ్రగ్స్ అండ్ కాస్మొటిక్ యాక్ట్ ప్రకారం ప్రతీ మెడికల్ షాపులో రిజిష్టర్ ఫార్మసిస్టు ఉండాలి. బీ–ఫార్మసీ, ఎంఫార్మసీ ఇలా ఏదో ఒక ఫార్మసీ కోర్సు చేసిన వారు మాత్రమే మెడికల్ షాపు నిర్వహించాలి. మెడికల్ షాపులకు అనుమతిచ్చే సమయంలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఫార్మసిస్టు ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయాలి. ఏరియా ఇన్‌స్పెక్టర్లు బాధ్యత వహించాలి. కానీ కొందరు ఏరియా ఇన్‌స్పెక్టర్లు చూసీచూడనట్లు ఉంటున్నారు.

కాలం చెల్లిన మందుల విక్రయం..

డ్రగ్స్ కాలం చెల్లినవి, నకిలీ మందులు జోరుగా విక్రయిస్తున్నారు. ఇటీవల కళ్యాణదుర్గంలోని ఓ దుకాణం వద్ద కాలం చెల్లిన మాత్రల షీట్ వెలుగు చూసింది. దాన్ని కొందరు సామాజిక మాధ్యమంలో వైరల్ చేశారు. డ్రగ్స్ అధికారులు పట్టణంలోని ఎనిమిది మెడికల్ దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఐదు దుకాణాల్లో రికార్డులు సక్రమంగా లేదని గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్టు తెలుసుకొని చర్యలకు సిఫార్సు చేశారు. కణేకల్లు మండల కేంద్రంలోని ఓ అపోలో మెడికల్ దుకాణంలో ఇద్దరు యువకులు దురుసు ప్రవర్తనకు చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవగాహన లేకుండానే ఇష్టానుసారంగా మందులు అంటగడుతూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.



కఠిన చర్యలు చేపడతాం

నిబంధనలు పాటించని మెడికల్ దుకాణాలపై కఠిన చర్యలు చేపడతాం. ప్రతి దుకాణంలోనూ తనిఖీ చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. ఇటీవల కళ్యాణదుర్గంలో ఆకస్మికంగా ఎనిమిది దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించాం. ఐదు దుకాణాల్లో సరైన రికార్డులు లేవని గుర్తించి చర్యలకు సిఫార్సు చేశాం. కాలం చెల్లిన మందులు విక్రయిస్తే మెడికల్ షాపు సీజ్ చేసి, కేసులు నమోదు చేయిస్తాం.

– రమేష్‌రెడ్డి, డ్రగ్ ఏడీ, అనంతపురం

సిరిధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

- పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

ఉరవకొండ: సిరిధాన్యాల ఆహారం తీసుకుంటే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పద్మశ్రీ వార్డు గ్రహీత, ప్రముఖ ఆహార ఆరోగ్యశాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. ఆదివారం స్థానిక షిర్డీ సాయి కల్యాణ మంటపంలో ఆయూర్ ఆధ్వర్యంలో సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశానికి గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి, ఉరవకొండ రూరల్, అర్బన్ సీఐలు సయ్యద్ చిన్నగౌస్, మహానంది, నిస్వార్థ ఫౌండేషన్ ప్రతినిధులు సుధాకర్‌రెడ్డి, వెంకట్ తాడికొండలు పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా నేటికాలంలో అనేక జబ్బులు చుట్టుముడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లు, జీవనశైలిని మార్చుకోవాలన్నారు. సిరిధాన్యాల వాడకం అలవాటు చేసుకోవాలన్నారు. కొర్రలు, అండు కొర్రలు, సాములు, అరికలు, ఊదలు లాంటివి శరీరానికి ఎంతో శక్తిని ఇవ్వడమే కాకుండా ఆరోగ్యాన్ని పరిరక్షిస్తాయన్నారు. ప్రస్తుతం చాలామంది మధుమేహం బారిన పడుతుంటారని, అలాంటి వారు రాగులు వినియోగించాలని, దీన్ని వాడితే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తోందన్నారు. దీంతో పాటు కషాయాలు తాగడం అలవాటు చేసుకుంటే గ్యాస్ సమస్యలతో పాటు పొట్టలో ఎలాంటి చెడు కొలస్ట్రాల్ ఉండదన్నారు. శరీరంలో రక్తహీనత తగ్గాలంటే కరివేపాకు,గరిక కషాయం, మలబద్ధకానికి జామ ఆకు, తమల పాకు, కాలేయశుద్ధికి కొత్తిమీర, కానుగ ఆకు, మానసిక ప్రశాంతంత కోసం తమలపాకు (కాడతీసి) కషాయం చేసుకొని తాగాలన్నారు. బయట పారేయాల్సిన ఆహారాన్ని మనం పొట్టలో వేసుకోని రోగాలు కొని తెచ్చుకుంటున్నామన్నారు.

దుర్గంలో పేట్రేగిపోతున్న పెట్రోల్ దొంగలు

- అర్ధరాత్రి ఇంధన దొంగల హల్‌చల్
- ఇళ్లముందు నిలిపి ఉంచిన ద్విచక్రవాహనాలే లక్ష్యం
- బెంబేలెత్తుతున్న వాహనదారులు



కళ్యాణదుర్గం: పట్టణంలో ఇటీవల కాలంలో పెట్రోల్ దొంగలు పేట్రేగిపోతున్నారు. ఆరుబయట నిలిపిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ పీకేస్తున్నారు. రాత్రి సమయాల్లో గస్తీ చేపట్టాల్సిన పోలీసులు.. చోరీలు జరిగిన ప్రాంతాల్లో మినహా మరెక్కడా కనిపించలేదన్న విమర్శలు ఉన్నాయి.

= స్థానిక విద్యానగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయం పైభాగంలో మూడిళ్ల వద్ద ఆరుబయట ఉంచిన ద్విచక్రవాహనాల్లో పెట్రోల్‌ను శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లారు. ఉదయం బైకులను స్టార్ట్ చేయాలనే చూస్తే స్టార్ట్ కాక అవస్థలు పడుతున్నారు. తీరా ట్యాంకును చూస్తే అందులో పెట్రోలు ఖాళీగా ఉంటోంది.

కొద్ది కాలంగా దొంగల హల్‌చల్..

కళ్యాణదుర్గంలో కొద్ది రోజులుగా పెట్రోల్ దొంగలు అధికమయ్యారు. అసలే వేసవి కాలం కాబట్టి ఇంటి శ్లిపాది ఉక్కపోత తాళలేక ఇళ్లపైన నిద్రించడానికి వెళ్తారు. కొందరు, ఫ్యాన్లు, కూలర్లు వేసుకుని నిద్రిస్తుంటారు. ఇంటి లోపల ఫ్యాన్లు, కూలర్ల శబ్దానికి బయట ఏం జరుగుతోందో కూడా తెలియని పరిస్థితి. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇప్పుడు కొత్త తరహా దొంగతనాలకు తెర లేపారు. ఇంటి ఆవరణల్లో పార్కింగ్ చేసిన బైకుల్లోని పెట్రోలు లాగేస్తున్నారు.

పెట్రోలింగ్ నిర్వహించని పోలీసులు..

రాత్రి సమయాల్లో పట్టణంలో గస్తీ పెట్రోలింగ్ నిర్వహించాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీలు జరిగిన సమయంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు గస్తీ తిరగడం తప్ప.. ఇతర ప్రాంతాలపై దృష్టి పెట్టలేదని ప్రజలు అంటున్నారు. రాత్రి సమయాల్లో ప్రధాన రహదారులు, శివారు కాలనీల్లో పోలీసులు గస్తీ నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

సర్పంచుకు మెట్టు గోవిందరెడ్డి పరామర్శ



సర్పంచు యన్నప్పను పరామర్శిస్తున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం సర్పంచు కురుబ యన్నప్పను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యన్నప్ప ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చారు. గ్రామంలోని మాజీ సర్పంచు కురుబ లోకేష్, నాయకులు మల్లికార్జున, తేజ, వెంకటేశ్వర్‌రెడ్డి, హనుమంత రెడ్డి, కార్యకర్తలతో ఆయన సమావేశమై, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పైనేటి తిమ్మప్పచౌదరి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పి.బ్రహ్మానందరెడ్డి, వైస్ కన్వీనర్ వేమన, మాజీ కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, సర్పంచు భాస్కర్‌రెడ్డి, నాయకులు యంద్రకాయల వన్నూరప్ప, హళ్లి నాగరాజు, డి.శ్రీనివాసులు, కెనిగుంట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కూ ఈ కేవైసీ తప్పనిసరి

రాయదుర్గంటౌన్: రేషన్ కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాల్సి ఉంటుంది. వంద శాతం పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. రాయదుర్గం రూరల్, అర్బన్ పరిధిలో మొత్తం 99 వేల యూనిట్లకు ఇప్పటి దాకా 15 వేల మంది రేషన్‌కార్డుల్లో సభ్యుల ఈకేవీఐసీ పెండింగ్ ఉందన్నారు. ఈ నెలాఖరు వరకు ఈకేవైసీ చేయించాల్సి ఉందన్నారు. ఇప్పటికే స్టోరు డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి ఈకేవైసీ చేసుకోని కార్డుదారుల జాబితాను అందించారన్నారు. డీలర్ల వద్ద ఈ పాస్ మిషన్‌లో ఈకేవైసీ చేయాల్సి ఉంటుందన్నారు. కార్డుదారుల్లో సభ్యుల ఈకేవైసీ కాని పక్షంలో రేషన్ పంపిణీకి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇంకా ఎవరయితే సభ్యుల ఈకేవైసీ కాలేదని వారిని చైతన్యపరిచి కచ్చితంగా ఈ పాస్ మిషన్‌లో పూర్తి చేయించాలని సూచించారు.

నేడు పీ–4 గ్రామ సభలు

శెట్టూరు: మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో సోమవారం పీ–4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పాట్నర్‌షిప్)కు సంబంధించి ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురాంరావు ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామసభల ద్వారా ప్రతి గ్రామంలో తక్కువ ఆదాయం ఉన్న 20 శాతం కుటుంబాల జాబితాను గుర్తించనున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో అర్చకుడు మృతి

కంబదూరు: మండల కేంద్రంలోని పురాతన కమల మల్లేశ్వరస్వామి ఆలయ అర్చకుడు మంజుస్వామి (49) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. కొద్ది రోజుల నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మంజునాథ్‌కు భార్యతో పాటు ముగ్గురు పిల్లలున్నారు. మంజుస్వామి మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే గంగాధర్, కళ్యాణదుర్గం టౌన్ కన్వీనర్ ఐ.సుధీర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప, వార్డు మెంబర్ పవన్లు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంక్షిప్త సమాచారం

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం తగదు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో ఆర్ఎంపీలు అర్హత లేని వైద్యంతో ఇప్పటికే ముగ్గురు పేదలు ప్రాణాలు కోల్పోయారని, ప్రజారోగ్యంపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని బీసీవై నియోజకవర్గ అధ్యక్షుడు గౌని ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్షణం నకిలీ ఆర్ఎంపీ వైద్యులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకోకుండా, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా క్షేత్రస్థాయిలో చర్యలు ఉండాలన్నారు. ప్రజలు నకిలీ ఆర్ఎంపీలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారి ప్రాణం తీసిన ఆర్ఎంపీ వైద్యుడి సర్టిఫికెట్లను పరిశీలించి, తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలం అరవకూరు మలుపు సమీపంలో అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బళ్లారికి చెందిన లింగన్న, వంద్రప్ప గాయపడ్డారు. ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి సొంతూరికి వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడ్డారు. గాయపడిన వారు కూడేరు ఆస్పత్రిలో చికిత్స పొందారు.

తప్పిన పెను ప్రమాదం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ పరిధిలోని అక్కమాంబ ఆలయ ఆవరణలో ఆదివారం లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం నేలకొరిగి విద్యుత్ తీగలు నేలను తాకి ఆప్రాంతమంతా విద్యుత్ సరఫరా అయ్యింది. అదే సమయంలో ఆప్రాంతంలో జనసంచారం లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రకరూరు:స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగు బంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహామంగళ హారతి, తీర్థప్ర సాద వినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహి ంచారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలోని దశభుజ మహాగణపతికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

బొమ్మనహాళ్: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లతో జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు ప్రారంభం కావడంతో యువత ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగుల జోలికెళ్లకుండా ఉండాలన్నారు. చిన్న మొత్తాలతో ప్రారంభించిన బెట్టింగులు ఆసక్తి పెరిగే కొద్ది పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోతారన్నారు. చివరకు మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యా ప్రయత్నాలకు దారితీస్తాయన్నారు. ఈ తరహా కేసుల్లో నిందితులకు శిక్షతో పాటు జరిమానాలు తప్పవన్నారు. ఆన్‌లైన్ ఆఫ్‌లైన్ బెట్టింగులకు పాల్పడేవారి సమాచారానికి డయల్ 100 లేదా 9346010584కి అందించాలని ఎస్ఐ కోరారు.

షటిల్ టోర్నీ ప్రారంభం



షటిల్ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో ఉన్న షటిల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి షటిల్ టోర్నీ అట్టహాసంగా ప్రారంభమైంది. టోర్నీకి స్పాన్సర్‌గా టి.గణేష్ బాబు, సప్తగిరి మల్లికార్జున, టీచర్ చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ వ్యవహరించారు. ఈసందర్భంగా నిర్వాహకులు లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు సప్తగిరి మల్లికార్జున, గణేష్‌బాబు మాట్లాడుతూ పోటీల్లో 15 జట్లు పాల్గొంటాయని, దాదాపు 50 మంది క్రీడాకారులు పోటీపడనున్నారన్నారు. మొదటి రోజు లయన్స్ క్లబ్ క్రీడాకారులు బాలచంద్ర, గణేష్‌బాబు, సురేంద్ర, సప్తగిరిమల్లి, సురేష్, సంజీవరెడ్డి, నరేష్‌లు పోటీపడ్డారన్నారు.

పనిచేయని వీడియో కాన్ఫరెన్స్ సెట్

బొమ్మనహాళ్: మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ సెట్ పనిచేయడంలేదు. దీంతో ప్రతి సోమవారం అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించటం పరిపాటి. ఈ నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు నాలుగు నెలల క్రితం మరమ్మతుకు గురయ్యాయి. ఉదయం 9.30 గంటలకల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తహసీల్దార్, ఎంపీడీఓతో పాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరవ్వాల్సి ఉంటుంది. వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు పని చేయకపోవటంతో (పీజీఆర్ఎస్) పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం కార్యక్రమంలో పాల్గొనేందుకు మండల స్థాయి అధికారులు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

దుర్మార్గులను శిక్షించాలి

కళ్యాణదుర్గం రూరల్: తూర్పుగోదావరి జిల్లాలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయడం దుర్మార్గమని, దుశ్చర్యకు పాల్పడిన వారిని శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకుడు చెలిమప్ప ఆదివారం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కళామండలి అధ్యక్షుడు నరసింహులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం



ఉరవకొండలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం



రాయదుర్గంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ

కళ్యాణదుర్గం రూరల్: భగత్‌సింగ్ ఆశయాలను కొనసాగిద్దామని ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ కోశాధికారి పవన్‌కుమార్, పట్టణ కార్యదర్శి హర్షవర్ధన్, గర్ల్స్ కన్వీనర్ మౌలిక , విద్యార్థులు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మండలాధ్యక్షులు నందు, కార్యదర్శి హారున్ రషీద్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆసీఫ్, కిరణ్ పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండల కేంద్రంలో భగత్‌సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి విరూపాక్షి మాట్లాడారు. జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, హమాలీ యూనియన్ నాయకులు చంద్రశేఖర్, సభ్యులు సుధాకర్, పెద్దన్న, సుధాకర్, తలారి ప్రసాద్, హమాలి సుధాకర్ పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బంగి శివ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, గౌతమ్, వలి, అరవింద్, మహబూబ్‌బాషా, భరత్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: స్థానిక శ్రీనివాస విద్యానికేతన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు చందు, సాగర్, కిరణ్, చిరంజీవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.